సాక్షి తిరుపతి

గురువారం । 16 । నవంబర్ । 2023



కార్తీక దీపోత్సవానికి ఏర్పాట్లు

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించనున్న కార్తీక దీపోత్సవానికి ఏర్పాట్లు చేయాలని టీటీడీ జేఈఓ ఆదేశించారు. - 8లో



'సెమీ' సంబరం

సెమీ ఫైనల్స్‌లో న్యూజిలాండ్‌పై భారత్ విజయం సాధించడంతో తిరుపతిలో అభిమానుల సంబరాలు మిన్నంటాయి. – తిరుపతి కల్చరల్



పథకాల పనితీరు పరిశీలన

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు పథకాల తీరుతెన్నులను సీఎస్ఎస్ ఉద్యోగుల బృందం పరిశీలించింది. - 8లో

న్యూస్‌రీల్

పుస్తక ప్రదర్శన పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

తిరుపతి అర్బన్ : నగరంలోని అన్నమయ్య సర్కిల్ సమీపంలో ఉన్న గ్రంథాలయంలో వారోత్సవాల్లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను డీఈఓ శేఖర్ పరిశీలించారు. డీఈఓ మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువతీ యువకులు, విద్యార్థినీవిద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదువుకోవాలని సూచించారు. పిల్లలు కనీసం ఓ గంట పాటు గ్రంథాలయంలో పుస్తక పఠనానికి సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎస్.మధుబాల, లైబ్రేరియన్ శివప్రసాద్, పుర ప్రముఖులు కృష్ణారెడ్డి, జనార్ధన్ , పి.గోపాల్, ముషీర్ అహ్మద్ పాల్గొన్నారు. అలాగే గోవిందరాజస్వామి గుడి సమీపంలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ సూర్యనారాయణమూర్తి నేతృత్వంలో రెండోరోజు పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కె.శివ కుమార్ , కె.సునీల్‌బాబు, ఆర్.భారతి , టి.ప్రతాప్ , ఎల్.మనిగనడన్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 69,041 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 22,415 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.19 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 14 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

మత్స్యకారులు అప్రమత్తం



మత్స్యకారులతో మాట్లాడుతున్న అధికారులు

చిల్లకూరు : బంగాళ ఖాతంలో అల్పపీడనం ఏర్పడిన నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, వేటకు వెళ్లరాదని మత్స్యశాఖ అధికారి రఘుబాబు హెచ్చరించారు. బుధవారం ఈ మేరకు తమ్మినపట్నం, గుమ్మళ్లదిబ్బ గ్రామాల్లోని మత్స్యకారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తీరంలోని బోట్లను సురక్షిత ప్రాంతంలో భద్రపరుచుకోవాలని సూచించారు. సముద్రంలో అలలు ఉధృతంగా ఉన్నందున వేటకు వెళ్లకపోవడం మంచిదన్నారు. ఈ మేరకు వేటను రెండు రోజులపాటు నిషేధించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సహాయకుడు రవికుమార్, సర్పంచ్ నెల్లిపూడి సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శి గురుదయ్య పాల్గొన్నారు.

పకడ్బందీగా ఈవీఎంల చెకింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడి

తిరుపతి అర్బన్ : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేసినట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు చేపడుతున్న చర్యలను వివరించారు. అందులో భాగంగా అక్టోబర్ 16వ తేదీ నుంచి ఈవీఎంల చెకింగ్ చేపట్టినట్లు వెల్లడించారు. రాజకీయ పార్టీల సహకారంతో అన్ని పనులు పూర్తయినట్లు వివరించారు. జిల్లాకు బెల్ కంపెనీ నుంచి 6,780 బ్యాలెట్ యూనిట్లు, 5,335 కంట్రోల్ యూనిట్లు, 6,450 వీవీ ప్యాట్లు అందినట్లు తెలిపారు. లోడ్ టెస్ట్‌లో వీటి పనితీరు విజయవంతంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈవీఎంల భద్రత కోసం పటిష్టమైన బందోబస్తు, నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటరు క్లెయిమ్స్, అబ్జెక్షన్లపై క్షేత్రస్థాయి పరిశీలన నిరంతరం కొనసాగుతుందన్నారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాలను 288 సెక్టార్లుగా విభజించి, 288 మంది రూట్ ఆఫీసర్లను నియమించనున్నట్లు తెలిపారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఏమైనా ఫిర్యాదులు ఉంటే తెలియజేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేత చంద్ర మోహన్ రెడ్డి, టీడీపీ నేతలు పులివర్తి సుధారెడ్డి, మనోహరాచారి, బీజేపీ నేత పురుషోత్తం నాయుడు, కాంగ్రెస్ నేత రవి, ఈఆర్ఓలు హరిత, నిషాంత్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఎన్నికల సెక్షన్ తహసీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైభవోత్సవం



అమ్మవారికి హారతి సమర్పణ



స్వర్ణరథంపై ఊరేగుతున్న పద్మావతీదేవి

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని పట్టపురాణి శ్రీపద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవ శోభతో విరాజిల్లుతున్నారు. సిరులతల్లి సర్వాలంకారభూషితులై దివ్యతేజస్సుతో అలరారుతున్నారు. సర్వభూపాల వాహనంపై శ్రీకృష్ణుని అవతారంలో కొలువుదీరి భక్తులను కటాక్షించారు. దేదీప్యమానంగా వెలుగొందుతూ సౌభాగ్యలక్ష్మీదేవి స్వర్ణరథాన్ని అధిరోహించి సకల జీవకోటికి అభయమిచ్చారు. మంగళవాయిద్యాలు.. కళాప్రదర్శనలు.. ప్రబంధ పారాయణాల నడుమ తిరువీధుల్లో విహరిస్తూ దర్శనమిచ్చారు. శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రుడైన గరుడుని అధిష్టించి సకల జనులను అనుగ్రహించారు.

- వైభవంగా శ్రీపద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాలు
- సర్వభూపాల వాహనంపై ఊరేగిన సిరులతల్లి
- శోభాయమానంగా స్వర్ణరథోత్సవం, గరుడసేవ



గరుడ వాహనంపై కొలువుదీరిన అలమేలు మంగమ్మ



తిరుచానూరు (చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన బుధవారం రాత్రి అమ్మవారు గరుత్మంతునిపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వేకువనే సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు సమర్పించారు. అనంతరం ఉట్టి కృష్ణుని అలకరణలో సర్వభూపాల వాహనంపై కొలువుతీరి భక్తులను అనుగ్రహించారు. మధ్యాహ్నం శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వర్ణరథంపై సౌభాగ్యలక్ష్మిగా శ్రీపద్మావతి అమ్మవారు తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు. రాత్రి 7గంటలకు ఆస్థానమండపంలో అమ్మవారికి ఊంజల్ సేవ జరిపించారు. అనంతరం అమ్మవారిని వాహనమండపానికి వేంచేపు చేసి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. పట్టుపీతాంబరాలు, వజ్రవైడూర్య ఆభరణాలు, శ్రీవారి పాదాలు, సహస్రలక్ష్మీ కాసుల హారంతో సిరులతల్లిని దివ్యాలంకారశోభితంగా అలంకరించారు. అనంతరం శ్రీవారి పాదాలతో అమ్మవారు గరుడునిపై ఆసీనులై తిరువీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 8గంటలకు సూర్యప్రభ, రాత్రి 7గంటలకు చంద్రప్రభ వాహన సేవలు నిర్వహించనున్నారు.



వాహన సేవలో కళాకారుల ప్రదర్శన



సర్వభూపాల వాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన, జేఈఓ తదితరులు



దేవతా రూపాల్లో కళాకారులు

అనుసరణీయం..మహనీయుల మార్గం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తదితరులు

తిరుపతి కల్చరల్ : సమాజ హితం కోసం నిరంతరం శ్రమించిన మహనీయుల మార్గం అందరికీ అనుసరణీయమని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని గిరిజన భవన్‌లో గిరిజన స్వాభిమాన ఉత్సవాలు–2023 నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ బిర్సా ముండా జీవించింది 25 ఏళ్లే అయినా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఆయన పోరాడిన తీరు చిరస్మరణీయమన్నారు. అప్పటి బీహార్, ఇప్పటి జార్ఖండ్‌లో ఆయనను దేవుడిగా పూజిస్తుంటారన్నారు. అంతటి మహనీయుడి జయంతిని జన జాతీయ గౌరవ దినోత్సవంగా జరుపుకుంటున్నామని వెల్లడించారు. నిరుపేద గిరిజన కుటుంబంలో జన్మించిన వ్యక్తి అప్పట్లో చదువుకోవడం వల్లే బ్రిటిష్ పాలనలో అన్యాయాలను గుర్తించి, పోరాడగలిగారని వివరించారు. అల్లూరి సీతారామరాజు సైతం చదువుకోవడం వల్లే పోరాడే తత్వం అలవడిందని చెప్పారు. అందుకే ప్రభుత్వం విద్య, వైద్యరంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. మహనీయుల జయంతి, వర్ధంతిని గుర్తు చేసుకుంటూ, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ ఆత్మస్థైర్యం పెంపొందించుకుంటే వెనుకబాటు తనాన్ని తగ్గించవచ్చని తెలిపారు. తమ సహచర డాక్టర్లు చాలామంది వారి పిల్లలను ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా తీర్చిదిద్దారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో పాదయాత్ర చేస్తూ ప్రజల కష్టాలను స్వయంగా పరిశీలించారని, అందుకే చదువుతోనే సమాజ అభ్యున్నతి సాధ్యమని గుర్తించారని వెల్లడించారు. త్యాగమూర్తుల జీవిత విశేషాలు స్ఫూర్తిగా తీసుకుని విద్యను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ చదువుకోవాలని కోరారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ మాట్లాడుతూ గిరిజన బిడ్డ బిర్సా ముండా జయంతిని జన జాతీయ గౌరవ దినోత్సవంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన కేబినెట్‌లో గిరిజనులకు పెద్దపీట వేశారని వెల్లడించారు. అనంతరం గిరిజన నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్ఓ పెంచల కిషోర్, గిరిజన నేతలు అక్కులప్ప నాయక్, చిరంజీవి, రఘురాం, సరస్వతి, కోటయ్య, ప్రభావతి, వసంతమ్మ, మల్లికార్జున, రామచంద్రయ్య, రామయ్య, పాండురంగవిఠల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పండుగలా వ్యవసాయం

అన్నదాతకు అండగా సీఎం జగనన్న

- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా
- సచివాలయం, ఆర్బీకే భవనాల ప్రారంభం



తిరుమణ్యంలో సచివాలయ భవనం ప్రారంభిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: దేశానికి వెన్నెముక అయిన అన్నదాతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొండంత అండగా నిలుస్తున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం వడమాలపేట మండలం తిరుమణ్యం గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం నూతన భవనాలను మంత్రి ప్రారంభించారు. ఆర్బీకేలో కియోస్క్ మిషన్ ద్వారా 300 బస్తాల యూరియాను ఆర్డర్ చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఆర్బీకే వ్యవస్థ ద్వారా వ్యవసాయాన్ని పండుగగా మార్చిందని స్పష్టం చేశారు. ఆర్‌బీకేల్లో అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు తన పాలనలో వ్యవసాయం దండగని అంటూ రైతులను అవమానించారని గుర్తు చేశారు. నేడు ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలను సైతం సబ్సిడీతో ఇంటి ముంగిటే అందిస్తున్నామని, దీంతో రవాణా ఖర్చులు సైతం మిగిలిపోయాయంటూ రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ–క్రాప్ బుకింగ్‌తో పంట నష్టపరిహారం అందించడంలోనూ ప్రభుత్వం దీమానిస్తోందని చెప్పారు.

గాంధీ కలలుగన్న స్వరాజ్యం

మహాత్ముడు కన్న కలలను సాకారం చేసే దిశగా జగనన్న సచివాలయ వ్యవస్థను సైతం తీసుకువచ్చారని మంత్రి రోజా తెలిపారు. గతంలో ఒక సర్టిఫికెట్ పొందాలంటే మండల, జిల్లా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, సచివాలయాల వ్యవస్థతో ప్రయాసలకు, నిరీక్షణకు కాలం చెల్లిందని స్పష్టం చేశారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.ప్రసాద్‌రావు, ఉద్యానవన అధికారి దశరథరామిరెడ్డి, వడమాలపేట ఏఓ విజయకుమార్, ఎంపీడీఓ భానుమూర్తి, వైఎస్సార్ సీపీ వడమాలపేట మండల కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, సింగిల్ విండో ప్రెసిడెంట్ సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆర్బీకేలో రైతు కార్యక్రమాలను ప్రారంభించిన మంత్రి రోజా

చరిత్రలో నిలిచేలా అభివృద్ధి.. సంక్షేమం

- 99 శాతం హామీలు నెరవేర్చిన ఏకైక నేత జగనన్న
- వైఎస్సార్‌సీపీని గెలిపించుకుంటే మరిన్ని పథకాలు
- 'వై ఏపీ నీడ్స్ జగన్'లో టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, పక్కన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తదితరులు

తిరుపతి మంగళం/తిరుపతి అర్బన్ : చరిత్రలో నిలిచేలా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించిన గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. తిరుపతిలోని 33వ డివిజన్ సంజయ్‌గాంధీ కాలనీలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. చంద్రబాబు పరిపాలన, జగనన్న పరిపాలనపై ప్రజల అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ చంద్రబాబు పాలన దుర్మార్గమని విమర్శించారు. జగనన్న ప్రభుత్వంలో సుభిక్షంగా ఉన్నామని ప్రశంసించారు. ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కే చంద్రబాబును చూశామని, ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఏకైక నాయకుడు జగనన్నను ఇప్పుడు చూస్తున్నామని తెలిపారు. దేశ రాజకీయ చరిత్రలోనే ఇంతవరకు ఏ నాయకుడికీ సాధ్యం కానన్ని సంక్షేమ పథకాలను అందించిన దార్శనికుడు జగనన్న అని కొనియాడారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారని వెల్లడించారు. ఒక్క తిరుపతి నియోజకవర్గంలోనే రూ.1,600 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని తెలిపారు. ఇది జగనన్న వల్లే సాకారమైందని వివరించారు. తిరుపతి 33వ డివిజన్‌లోని సచివాలయ పరిధిలోనే సుమారు రూ.17 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తిరుపతిలో 26 వేల మంది పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని తెలిపారు. అలాగే నగరంలో 18 మాస్టర్ ప్లాన్, ఫ్రీ లెఫ్ట్ రోడ్లు నిర్మించామని వెల్లడించారు. 20 ఏళ్లుగా సాధ్యం కాని టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మంజూరు చేయగలిగామని వివరించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాల పెంపు, కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను రెగ్యులరైజ్ చేయడం వంటివి నెరవేర్చగలిగామని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు పొందవచ్చన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే పేదలను నట్టేట ముంచేస్తాడని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, పార్టీ తిరుపతి నియోజకవర్గ పరిశీలకుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జిలు ఆదం సుధాకర్‌రెడ్డి, వాసుయాదవ్, జేసీఎస్ అధ్యక్షుడు మద్దాలి శేఖర్, కార్పొరేటర్లు దూది కుమారి, మునిరామిరెడ్డి, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు కడపగుంట అమరనాథ్‌రెడ్డి, మహ్మద్‌ఖాసిం, నాయకులు దూది శివకుమార్, పద్మజ, విజయలక్ష్మి, రమణారెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో..

- గూడూరు రూరల్ పరిధిలోని మేఘనూరులో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పాల్గొన్నారు.
- చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు, కోట మండలం చంద్రశేఖరపురంలో జరిగిన ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వరప్రసాదరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ మండల కన్వీనర్ ఉదయ శేఖర్ రెడ్డి నాయకులు భక్తవత్సల రెడ్డి పాల్గొన్నారు. గూడూరు పట్టణంలోని గాంధీనగర్‌లో పార్టీ మండలాధ్యక్షుడు గురవయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు.
- వెంకటగిరి పట్టణం 8వ వార్డ్ సచివాలయంలో ఏపీకి జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీ బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య పాలొన్నారు.
- నాయుడుపేట ఎంఆర్ నగర్ సచివాలయంలో మున్సిపల్ చైర్మన్ కటకం దీపిక ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు.
- శ్రీకాళహస్తి మండలం మేలచ్చూరు సచివాలయం వద్ద పార్టీ మండల కన్వీనర్ వయ్యాల కృష్ణారెడ్డి నేతృత్వంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని ఆలయం ధ్వంసం



పడిపోయిన గుడి

వెంకటగిరిరూరల్ : శ్రీకాళహస్తి రూరల్ మండలం ఇలగనూరు వద్ద రోడ్డు పక్కనే ఉన్న ఆంజనేయస్వామి ఆలయాన్ని మంగళవారం రాత్రి తిరుపతి వైపు వెళుతున్న పాల లారీ ఢీకొంది. దీంతో ఆలయం పూర్తిగా విగ్రహం పాక్షికంగా ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న లారీ యజమానికి ఘటనాస్థలానికి చేరుకుని ఆలయ పునర్నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

భక్తి..ముక్తికి.. కార్తీకం

మాసాల్లో కార్తీకం..యుగాల్లో కృత యుగం.. శాస్త్రాల్లో వేదం..తీర్థాల్లో గంగానదికి సమానమైనవి లేవన్నది పురాణ వచనం. అంతటి మహత్యం గల కార్తిక మాసం శివకేశవులిద్దరికీ ప్రీతిపాత్రమైది. అందుకే భక్తులు వేకువనే చన్నీటి స్నానాలు.. జప, తప నియమాలు.. పూజలు.. ఉపవాసదీక్షలు చేస్తారు.
కార్తీక మాస విశిష్టతపై ప్రత్యేక కథనం.

- ధ్యానం, దీపం ప్రత్యేకం
- వత్రాలు, నోములకు ప్రాధాన్యం
- దీపోత్సవాలకు ఆలయాలు ముస్తాబు
- కార్తీక నెల ప్రారంభం



కార్తీకం.. ఆచరణ ఇలా

- కార్తిక మాసంలో మాంసాహారానికి దూరంగా ఉండాలి.
- తేలికైన ఆహారం భుజించాలి.
- ఉల్లి, వెల్లుల్లి తినకూడదు.
- పాలు, పండ్లు భుజించవచ్చు.
- రాత్రి భోజనం చేయకూడదు. అబద్ధాలు, దైవదూషణ చేయకూడదు.
- తప్పుడు పనులు చేస్తే పాపమని పురాణాలు చెబుతున్నాయి.

చిత్తూరు రూరల్: కార్తీక మాసంలో చంద్రుడు కృతికా నక్షత్రంలో ఉండడంతో ఈ నెలకు ఆ పేరు వచ్చింది. ఈ నెల శివకేశవులిద్దరికీ ప్రీతికరం. ఈ నేపథ్యంలో ఊరూరా హరిహరుల నామస్మరణతో మార్మోగనున్నాయి. రాత్రి వేళల్లో దీపాల వెలుగులు విరజిమ్మనున్నాయి. ఎంతో పవిత్రంగా భావించే కార్తీక మాసం వచ్చే నెల 12వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ నెల రోజులు శైవ, వైష్ణవ క్షేత్రాలు భక్తుల సందడితో కిటకిటలాడనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,197 దేవాలయాలున్నాయి. వీటిలో శివాలయాలు 45 వరకు ఉన్నాయి. ఈ ఆలయాల్లో కార్తిక పూజలు శ్రేష్ఠంగా జరుగుతుంటాయి. ముఖ్యంగా కార్తీక సోమవారాల్లో ఆలయాలు భక్తులతో కళకళలాడనున్నాయి. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లను ఆయా ఆలయ నిర్వాహకులు చేస్తున్నారు. భక్తులు ఇబ్బందులు లేకుండా దీపారాధన చేసేందుకు పనులు పూర్తి చేశారు.

కార్తీక స్నానం

కార్తీక మాసమంతా తెల్లవారుజామునే లేచి కృతికా నక్షత్రం అస్తమించేలోపు నది, చెరువు, కాలువల్లో కానీ, ఈ వనరులు అందుబాటులో లేకుంటే ఇంట్లో కానీ తలస్నానం చేయాలి.అప్పుడే కార్తీక స్నానం అవుతుంది. ఈ నియమంతో స్నానం చేసి, శివుడు, విష్ణువు, మరే దైవాన్ని అయినా ధ్యానించి, అర్ఘం ఇవ్వడంతో గంగానది, పుష్కర తీర్థాల్లో స్నానం చేసిన ఫలితం దక్కుతుందని పురాణాలు చెబుతాయి. సర్వ పాపాలు తొలగుతాయని భక్తుల నమ్మకం.

పుణ్యప్రదం.. కార్తీక దీపం

భారతీయ సంస్కృతిలో దీపారాధనకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. కార్తీక మాసంలో దీపారాధనకే ప్రథమ స్థానం. అందుకే ఇంట్లోకానీ, శివాలయంలో కానీ ప్రాతఃకాలం, సాయంకాలం దీపారాధన చేస్తారు. ఎవరైనా తెలిసికానీ, తెలియకుండా కానీ ఎక్కడైనా సరే దీపం పెడితే వారి పాపాలు హరిస్తాయని పురాణాలు తెలుపుతున్నాయి. దీపం, బంగారం, నవధాన్యాలు, అన్నం దానం చేస్తే స్త్రీలకు సౌభాగ్యం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. అందుకే దీపారాధనతో పాటు శివుడికి ప్రత్యేకంగా రుద్రాభిషేకం, లక్షబిల్వార్చ, అమ్మవారికి లక్షకుంకుమార్చన జరిపిస్తారు.

వన భోజనం

ప్రకృతి ఒడిలో సేదతీరుతూ ఆప్యాయతలను పంచుకునే అపురూప సందర్భం వనభోజనం కార్తిక మాస ప్రత్యేకం. ఐక్యత సాధనకు ఇది ఎంతో ఉపకరణం. కలిసిమెలిసి మసలుకునే తత్వం వనభోజన సంబరాలతో అలవడుతుంది. ఈ కార్యక్రమం వనాలపై మన బాధ్యతను గుర్తు చేస్తుంది. ఈ భోజన సంబరంలో పూర్తి సాత్విక వంటకాలనే భుజిస్తారు.

పుణ్యఫలం సిద్ధిస్తుంది



కార్తీక మాసంలోని ప్రతి రోజు కూడా అత్యంత శ్రేష్ఠమైనది. కార్తిక మాసం శివకేశవులకు చాలా ప్రీతపాత్రమైనది. తెల్లవారుజామునే ఆలయాలను దర్శించుకుని పూజలు చేయాలి. ఈ మాసంలో శివకేశవులను పూజిస్తే మహాపుణ్యం లభిస్తుంది. ఈ మాసంలో ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి. ఈ దీపాలు మనిషిలోని అజ్ఞానాన్ని పారద్రోలే జ్ఞాన జ్యోతులు కావాలి. ఈ నెలలో 17న నాగుల చవితి, 18న స్కంధషష్ఠి, 26న కార్తీకదీపం అతిముఖ్యమైన పండుగలు.

-సుధాకర్ గురుక్కల్, వేదపండితులు, చిత్తూరు

శ్రీవారి పాదాల ఊరేగింపు



తిరుచ్చిపై శ్రీవారి పాదాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న అర్చకులు, అధికారులు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు పద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారి పాదాలను ఊరేగించారు. గరుడోత్సవం సందర్భంగా శ్రీవారి పాదాలను అమ్మవారికి అలంకరించడం ఆనవాయితీ. అందులో భాగంగా దేవదేవుని పాదాలను పసుపు మండపానికి వేంచేపు చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, కోలాటాలు, భజనల నడుమ బంగారు తిరుచ్చిపై శ్రీవారి పాదాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. జేఈఓ వీరబ్రహ్మం, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, వీజీఓ బాలిరెడ్డి, ఏవీఎస్‌ఓ శైలేంద్రబాబు, అర్చకుడు బాబు స్వామి పాల్గొన్నారు.

టీటీడీ మహిళా ఉద్యోగుల సారె

కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పద్మావతీ అమ్మవారికి టీటీడీ జేఈఓ సదాభార్గవి ఆధ్వర్యంలో టీటీడీ మహిళా ఉద్యోగులు పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. జేఈవో మాట్లాడుతూ ఏటా అమ్మవారి బ్రహ్మోత్సవాల సమయంలో టీటీడీ మహిళా ఉద్యోగులు సారె అందించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అమ్మవారి అనుగ్రహంతో ఉద్యోగులు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వాణి, టీటీడీ మహిళా ఉద్యోగుల ప్రతినిధులు హేమలత, అనురాధ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



సారెను తీసుకువస్తున్న జేఈఓ సదా భార్గవి తదితరులు





కార్తీక దీపోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

తిరుపతి కల్చరల్: కార్తీక దీపోత్సవాల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ జేఈఓ సదా భార్గవి ఆదేశించారు. బుధవారం తిరుపతి పద్మావతి విశ్రాంతి గృహంలో అధికారులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ 20న తిరుపతిలో టీటీడీ పరిపాలన భవనం వెనుక పరేడ్ గ్రౌండ్‌లో కార్తీక దీపోత్సవాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. 27న కర్నూలులోని ఏపీఎస్పీ గ్రౌండ్స్, డిసెంబర్ 11న విశాఖలోని ఆర్‌కే బీచ్‌లో శ్రీకాళీమాత ఆలయం ఎదురుగా దీపోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాలను ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేస్తుందన్నారు. 20 సాయంత్రం 5.30 గంటలకు వేద స్వస్తితో దీపోత్సవం ప్రారంభమవుతుందని, అనంతరం దీప ప్రాశస్తి, టీటీడీ చైర్మన్ సందేశం, విష్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, విష్ణు సహస్రనామ పారాయణం, మహాలక్ష్మీ నృత్య రూపకం, గోవిందనామాలు, చివరిగా కుంభ హారతితో రాత్రి 8.30 గంటలకు కార్యక్రమం ముగుస్తుందని వివరించారు. సమావేశంలో తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు, ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖ్ కుమార్, ఎస్ఈ-2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీ ఈఓలు లోకనాథం, సుబ్రమణ్యం, వీజీఓ బాలిరెడ్డి, ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రామ్ అధికారి రాజగోపాల్, డిప్యూటీ సీఎఫ్ శ్రీనివాస్, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ పాల్గొన్నారు.

స్వర్ణముఖిలో గుర్తు తెలియని మృతదేహం



మృతదేహాన్ని వెలికి తీస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: పట్టణం వద్ద స్వర్ణముఖి నదిలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారంలో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని పోలీసులు, మున్సిపల్ సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి వివరాలు తెలియలేదని వన్ టౌన్ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఏరియా వైద్యశాలలోని మార్చురీకి తరలించినట్లు వెల్లడించారు.

తిరువట్యం డ్యామ్‌లో మృతదేహం

నారాయణవనం: మండలంలోని తిరువట్యం డ్యామ్ వద్ద పూర్తిగా కుళ్లిన దశలో మృతదేహం బుధవారం లభ్యమైంది. తిరువట్యం ఎస్టీ కాలనీకి చెందిన సిద్దయ్యగా(55) గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఐదు రోజులుగా అదృశ్యమైన సిద్దయ్య డ్యామ్ తూము వద్ద మృత దేహంగా కనిపించడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎస్టీ కాలనీకి సమీపంలో డ్యామ్ గట్టుపై సిద్దయ్య సెల్‌ఫోన్, దుస్తులు, చిల్లర నగదు దొరికినట్లు తెలిపారు. ప్రాజెక్టుకు అర కిలోమీటర్ దూరంలో ఎగువభాగాన మృత దేహం లభించడం పలు అనుమానాలకు తావిస్తోందని వెల్లడించారు. దీనిపై కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పరమేశ్‌నాయక్ తెలిపారు.

గ్రానైట్ లారీ స్వాధీనం



పోలీస్‌స్టేషన్ వద్ద లారీ

చంద్రగిరి : అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీని మైనింగ్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు వైపు వెళుతున్న లారీని చంద్రగిరి కోట సమీపంలో అధికారులు అడ్డుకున్నారు. సక్రమంగా పత్రాలు లేకపోవడంతో లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఇసుక టిప్పర్ సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్

చంద్రగిరి : మండలంలోని శానంబట్ల వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు మంగళవారం రాత్రి సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పథకాల పనితీరు పరిశీలన

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : కేంద్ర ప్రభుత్వ శాఖలో నూతనంగా నియమితులైన సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ (సీఎస్ఎస్) ఉద్యోగులు అంజూ తన్వార్, అనీషా జైన్, దివ్యాన్సీ త్రిపాఠి, సునీల్ కుమార్ మీనా, ప్రియాంక మీనా, అరవింద్‌కుమార్ కర్వతో కూడిన బృందం బుధవారం తొట్టంబేడు పంచాయతీలో పర్యటించింది. భారత్ దర్శన్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ముందుగా ఆయుష్మాన్ భారత్ కింద పీహెచ్‌సీని సందర్శించింది. స్వచ్ఛభారత్ మిషన్ కింద నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరును గమనించింది. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని ఆరా తీసింది. అనంతరం సచివాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశమైంది. భూముల రీ సర్వే, మహిళా సంరక్షణ కోసం దిశ యాప్, బాల్య వివాహాల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల సేవలు, భూసార పరీక్షలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో పంచాయతీ కార్యదర్శి అంకయ్య గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పంచాయతీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ తరుణాక్షరెడ్డి, జూనియర్ ఫ్యాకల్టీ బాల వసుధర్, డీఎల్‌పీఓ ప్రభురెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'మాధురి గోల్డ్' నెక్లెస్ మేళా



మేళాకు హాజరైన ఖాతాదారులు

శ్రీకాళహస్తి: దీపావళి, ధన త్రయోదశి సందర్భంగా శ్రీకాళహస్తి మాధురి గోల్డ్ వారు నిర్వహించిన నెక్లెస్ మేళా ఆకట్టుకుంది. కొనుగోలు చేయడానికి అధిక సంఖ్యలో ప్రజలు ఉత్సాహంగా హాజరయ్యారు . మేళాకు విశేష ఆదరణ చూపిన ఖాతాదారులకు మాధురి గోల్డ్ యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది . ఈ ఏడాది ఎగ్జిబిషన్ సేల్‌లో నకాస్ , కుందన్ , పోల్కి అన్‌కట్ హారాలు తక్కువ బరువుతో అందరూ కొనుగోలు చేయడానికి వీలుగా ఆభరణాలు ఉంచామని వెల్లడించింది. 30 ఏళ్లుగా తమ సంస్థను ఆదరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేసింది.

'సీకాం'లో ప్రాంగణ ఎంపికలు

- 39 మంది విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతి సిటీ : తిరుపతిలోని సీకాం డిగ్రీ కళాశాలలో ఈ నెల 6, 7వ తేదీల్లో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 39 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చినట్లు కాలేజీ చైర్మన్ సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నంది గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్, వీఓఐపీ ఆఫీస్ టెలికమ్యూకేషన్ వారు చేపట్టిన ఇంటర్వ్యూల్లో తమ విద్యార్థులకు ఉద్యోగాలు లభించడం ఆనందంగా ఉందన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.18వేల నుంచి రూ.25 వేలు వరకు వేతనాలు అందనున్నట్లు వివరించారు. ఏపీఈఐటీఏ జనరల్ మేనేజర్ చెవిరెడ్డి హేమచంద్రారెడ్డి సహకారంతో విద్యార్థులకు ఈ అవకాశం దక్కినట్లు తెలిపారు. ఈ మేరకు కళాశాల సంచాలకులు ప్రణీత్ స్వరూప్, తేజ స్వరూప్ తోపాటు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

రొడ్డ సురేంద్రకు సాహిత్య పురస్కారం



తిరుపతి కల్చరల్ : రచయిత, కవి, గాయకుడు, ఉపాధ్యాయుడు రొడ్డ సురేంద్రకు జాతీయ సాహిత్య పురస్కారం లభించింది. సాహితీ రంగానికి ఆయన చేస్తున్న సేవలను గుర్తించి పురస్కారానికి ఎంపిక చేసినట్లు విమల సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్ జెల్ది విద్యాధర్‌రావు బుధవారం తెలిపారు. ఈనెల 19వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ప్రదానోత్సవంలో ఆయనకు పురస్కారం అందించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సురేంద్రకు పలువురు ఉపాధ్యాయులు, సాహితీ ప్రియులు ఆయనను అభినందనలు తెలిపారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి



నాధముని (ఫైల్)

ఏర్పేడు : మండలంలోని పాతవీరాపురంలో ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన నాధముని(20) సుమారు 3 ఏళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. మంగళవారం నొప్పి మరింత తీవ్రం కావడంతో పురుగుల మందు తాగేశాడు. కుటుంబీకులు వెంటనే తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీహరి తెలిపారు.

త్వరలోనే కుప్పానికి కృష్ణా జలాలు



హంద్రీ-నీవా కాలువ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ భరత్ , చిత్తూరు కలెక్టర్ షణ్మోహన్

శాంతిపురం: త్వరలోనే కుప్పం ప్రాంతానికి కృష్ణానది జలాలను తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. బుధవారం గుండిశెట్టిపల్లె వద్ద హంద్రీ-నీవా కుప్పం కాలువను పరిశీలించి, కాలువ కోసం భూములు కోల్పోయిన రైతులతో మాట్లాడారు. కుప్పం కెనాల్‌లోకి నీరు వచ్చేందుకు శంకర్రాయులపేట, కృష్ణాపురం, ఆదినపల్లె వద్ద మూడు ఎత్తిపోతల యూనిట్లు ఉన్నాయన్నారు. వీటిలో రెండు చోట్ల లిఫ్ట్ పనులు పూర్తి అయ్యాయని, ఆదినపల్లె వద్ద మరో వారం రోజుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాలువ కోసం భూములు కోల్పోయిన రైతులకు నెలాఖరులోపు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. రికార్డులు సక్రమంగా ఉండి, ఆయా భూముల్లో సాగులోని రైతులను ఏ కేటగిరీగా, రికార్డులు లేదా అనుభవం మాత్రమే ఉన్న వారిని బీ కేటగిరిగా, రెండవ కేటగిరీలో అర్హతలు లేనివారిని సీ కేటగిరిగా గుర్తించి పరిహారం చెల్లిస్తామని వివరించారు. రైతులకు నష్టం వాటిల్లకుండా పరిహారం అందుతుందని తెలిపారు. ఆర్డీవో శ్రీనివాసులు, హంద్రీనీవా డీఈ రమేష్, డెప్యూటీ తహసీల్దార్ కొలేష్ పాల్గొన్నారు.